క్లుప్తంగా

అన్నదానానికి రూ.56,166 విరాళం



పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం హైదరాబాద్, రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన తాళ్లూరి అనిల్‌కుమార్, కల్పన దంపతులు వారి కుమార్తెలు భవిష్య, తన్విక పేర్ల మీద రూ.56,166ను ఆలయ సూపరింటెండెంట్ లక్ష్మణ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్లు బద్దుల కృష్ణ మోహన్, శశికపూర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి



నందిగామ రూరల్: గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నతికి తమ వంతు సహకారం అందిస్తామని మాజీ మంత్రి వసంత నాగేశ్వర రావు పేర్కొన్నారు. మండలంలోని ఐతవరం గ్రామానికి చెందిన విద్యార్థిని వెంపరాల భావన కుటుంబ సభ్యులకు రూ. లక్ష చెక్కును ప్రోత్సాహక బహుమతిగా మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీసీ గ్రూపులో 980 మార్కులు సాధించటం అభినందనీయమని ఉన్నత చదువులలో కూడా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. నాయకులు వీరాస్వామి, అంకూరావు, మద్దుకూరి రామారావు, అనిల్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేతన్నల ఆకలి చావులు ప్రభుత్వ హత్యలే

జగ్గయ్యపేట అర్బన్: నేతన్నల ఆకలి చావులు కూటమి ప్రభుత్వం చేసిన హత్యలుగా భావించాల్సి ఉంటుందని వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం నేతన్నలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఆప్కో నుంచి బకాయిలు చెల్లించకపోవడం, ప్రభుత్వం ప్రకటించిన విద్యుత్ రాయితీలు, సబ్సిడీలు అందకపోవడంతోపాటు చేనేత వస్త్రాలు కొనేవారు లేక నేతన్నలకు ఆత్మహత్యలే శరణ్యమవుతున్నాయన్నారు. ఇటీవల హిందూపురంలో, ధర్మవరంలలో జరిగిన ఘటనలే ఇందుకు నిదర్శనాలన్నారు. ఇక ముందు ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే చేనేత కార్మికుల విషయంలో తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



మక్కపేట(వత్సవాయి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ సామాజిక విజ్ఞాన కళాశాల గుంటూరు లాంఫాం వారి ఆధ్వర్యంలో వ్యవసాయ విద్యార్థులు గత వారం రోజులుగా గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని నిర్వహించారు. చివరిరోజు మంగళవారం గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, డిబేట్ వంటి పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ వి. ప్రసూన మాట్లాడుతూ వారం రోజులుగా గ్రామంలో శిబిరాన్ని నిర్వహించడంలో గ్రామస్తులు మంచి తోడ్పాటునందించారని తెలిపారు. విద్యార్థులకు అండగా నిలిచి వారికి కావాల్సిన సౌకర్యాలను అందించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త ఆర్. ప్రభావతి, తిరుమలగిరి ఆలయ చైర్మన్ కేఆర్ భరద్వాజ్, ఎంఆర్‌టీ కళాశాల ప్రిన్సిపాల్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవిత సెంటర్‌కు ప్రత్యేక పరికరాలు అందజేత



ఇబ్రహీంపట్నం: ఫెర్రీలోని భవిత స్పెషల్ నీడ్స్ సెంటర్‌కు రూ.1.5 లక్షల విలువైన సహాయ పరికరాలు, ఫర్నిచర్‌ను ప్యూర్ (పీపుల్ ఫర్ అర్బన్, రూరల్ ఎడ్యుకేషన్) సంస్థ మంగళవారం అందజేసింది. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సురక్షితమైన, సమగ్ర అభ్యాస వాతావరణం కల్పించడం లక్ష్యంగా వీల్‌చైర్లు, సెరిబ్రల్ పాల్సీ కుర్చీలు, కమోడ్ వీల్‌చైర్లు గదిలోని ఫర్నిచర్ అందించారు. ప్యూర్ సీఈఓ డాక్టర్ శైలా తాళ్లూరి మాట్లాడుతూ సంస్థ సేవలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సభ్యులు వనజ, ఎంఈఓ పుష్పలత, సీఆర్పీ డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దిగుబడి రాక.. మద్దతు లేక

కుదేలవుతున్న పత్తి రైతు

- అధిక వర్షాలకు తగ్గిన దిగుబడి
- ఎకరానికి గరిష్టంగా ఐదు క్వింటాళ్లకు మించని దుస్థితి
- సీసీఐ కేంద్రాల ఏర్పాటులో జాప్యం
- నాణ్యత పేరుతో వ్యాపారుల ఇష్టారాజ్యం
- పత్తి రైతులకు తీరని నష్టం

పెనుగంచిప్రోలు: గతేడాది మిర్చికి ధర లేకపోవడంతో రైతులు ఈ ఏడాది పత్తి సాగుపై అధికంగా దృష్టి సారించగా, అధిక వర్షాలు పత్తి రైతుల ఆశలను నట్టేట ముంచాయి. ఫలితంగా దిగుబడులు భాగా తగ్గాయి. మరోవైపు ఈ కొద్దిపాటి దిగుబడులను అమ్ముకుందామన్నా ప్రభుత్వం సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో ప్రైవేట్ వ్యాపారులు రైతులకు తగిన ధర ఇవ్వడం లేదు. దీంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకుండాపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

17వేల ఎకరాల్లో పత్తిసాగు..

మిర్చి తర్వాత రైతులు జిల్లాలో పత్తి సాగు అధికంగా చేస్తారు. ఈ ఏడాది నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో 17వేల ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. మిర్చి ధరలో ఒడిదొడుకులు, సాగు వ్యయం పెరగడంతో గతేడాదితో పోలిస్తే ఈఏడాది అధికశాతం మంది రైతులు పత్తిసాగు వైపు మొగ్గుచూపారు. సీజన్ ఆరంభంలో వర్షాలు సాధారణంగానే ఉన్నా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నమోదైన అధిక వర్షాలతో పత్తి పంట దెబ్బతింది. నాలుగు రోజులుగా కూడా వర్షాలు పడుతూనే ఉన్నాయి. పై మూడు నెలలు పత్తికి కీలక సమయం కావడంతో దిగుబడి గణనీయంగా పడిపోయింది.



కలుపు కూడా తీయకుండా వదిలేసిన పత్తి చేను



వర్షాలకు రాలిపోతున్న పత్తి



వర్షాలకు ముడుచుకుపోతున్న పత్తికాయలు

ఎకరానికి ఐదు క్వింటాళ్లు మించి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం పత్తి తీతలు జరుగుతున్న సమయంలో వర్షాలకు పగిలిన కాయల నుంచి పత్తి రాలిపోతుండటంతో పాటు గుల్లగా మారిన పత్తికాయ ముడుచుకుని పోతోంది. దీంతో పత్తి రంగు మారుతోందని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు పత్తి కాపు లేక పొలాలను కలుపు కూడా తీయకుండానే వదిలేయడం గమనార్హం.

లభించని మద్దతు ధర..

ఓ పక్క దిగుబడి పడిపోయి, అరకొరగానే వస్తున్న పత్తి దిగుబడికి సైతం కనీస మద్దతు ధర దక్కని పరిస్థితి నెలకొంది. ఎకరా పత్తి సాగుకు రూ.30 వేల నుంచి రూ.35 వేలు వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. కౌలు రైతుకు అదనంగా మరో రూ.20 వేలు సాగు వ్యయం పెరుగుతుంది. దిగుబడి ఎకరాకు ఐదు క్వింటాళ్లకు మించకపోతుండగా, క్వింటా ధర సగటున రూ.6వేలు లెక్కించినా రాబడి రూ.30వేలకు మించడం లేదు. ఇక తేమ శాతం ఆధారంగా క్వింటా పత్తికి కేంద్రం రూ.8,110గా మద్దతు ధర నిర్ణయించింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కేంద్రాలు ఏర్పాటైతేనే రైతులకు మద్దతు ధర దక్కే అవకాశం ఉంది. కానీ ఈ కేంద్రాలు వచ్చే నెలలో ఏర్పాటవుతాయని రైతులు చెబుతుండగా, ఈలోగా రైతుల ఇబ్బందులను ఆసరాగా చేసుకుని క్వింటా పత్తిని రూ.4వేల నుంచి రూ. 5వేలకు కొనుగోలు చేసేందుకు ప్రైవేట్ వ్యాపారులు మాటు వేసి ఉండటం గమనార్హం.



ఎకరానికి రూ.50 వేల పెట్టుబడి..

ఎకరానికి కౌలుతో కలుపుకుని పత్తి సాగుకు రూ.50 వేలు ఖర్చయ్యింది. అధిక వర్షాలు పంటను బాగా దెబ్బతీశాయి. చాలామంది రైతులకు ఎకరానికి 5 క్వింటాళ్లు మించి పత్తి దిగుబడి రావడం లేదు. పత్తిని ఈ ధరలో అమ్ముకుంటే నష్టాలే మిగులుతాయి. ప్రభుత్వం సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తిని కొనుగోలు చేయాలి.

– చుంచు బెనర్జీ, రైతు, పెనుగంచిప్రోలు



క్వింటా రూ.6వేలకు అడుగుతున్నారు..

మొదటి తీత పత్తిని క్వింటా రూ.6వేలకు అడుగుతున్నారు. నిల్వ చేసుకోలేక రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎకరానికి ఐదు క్వింటాళ్ల దిగుబడి వస్తే పెట్టుబడి, కౌలు పోను ఎకరానికి రూ.30 నుంచి రూ.35 వేల నష్టం వస్తుంది. మిర్చికి ధర లేదని పత్తి సాగు చేస్తే అధిక వర్షాలు దారుణంగా దెబ్బతీశాయి.

– పద్మాల నాగేశ్వరరావు, రైతు, పెనుగంచిప్రోలు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నందిగామ రూరల్: పౌష్టికాహారం తీసుకోవటం వల్ల పరిపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీపీ పెసరమల్లి రమాదేవి పేర్కొన్నారు. నందిగామ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మండల స్థాయిలో జాతీయ పోషకాహార మహోత్సవాలను సీడీపీవో లక్ష్మీభార్గవి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవటం వల్ల రక్తహీనత, తదితర అనారోగ్య సమస్యలను నివారించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకు కూరలు, సజ్జలు, రాగులు, కొర్రలు, పెసలు, శనగలు, పాలు, గుడ్లు, పండ్లు వంటి వాటిని క్రమం తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవటం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. అనంతరం చిరుధాన్యాలతో తయారు చేసిన వంటల ప్రదర్శనను పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో ప్రసాదరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు తారాబి, వెంకట్రావమ్మ, కరుణకుమారి, విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

ఆర్డీవో బాలకృష్ణ

నందిగామ టౌన్: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టాలని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లకు సంబంధించి డివిజన్‌లోని తహసీల్దార్‌లు, వ్యవసాయ శాఖాధికారులు, సొసైటీ సిబ్బంది, రైస్‌మిల్లర్‌లతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు సాఫీగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ముఖ్యంగా తేమ శాతంపై రైతులకు అవగాహన కలిగించాలని తెలిపారు. అంతే కాకుండా కొనుగోలు కేంద్రాలలో తూకం యంత్రాలు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం రవాణా చేసే ప్రతి వాహనాన్ని జియో ట్యాగింగ్ చేయటంతో పాటు ట్రక్ షీట్‌లను సక్రమంగా రూపొందించాలని చెప్పారు. రైతులకు అవసమైన సమాచారం, మార్గదర్శకాలను గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద అందించాలని చెప్పారు. మిల్లర్‌లను సమన్వయం చేసుకుంటూ ధాన్యం దిగుమతిలో జాప్యం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతు ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ధాన్యం కొనుగోళ్లను చేపట్టాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో బాలకృష్ణ

పేట మండలంలో 10 ధాన్యం కొనుగోలు కేంద్రాలు..

జగ్గయ్యపేట: మండలంలో 10 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్ మంగళవారం పేర్కొన్నారు. మండలంలోని అన్నవరం, బలుసుపాడు, అనుమంచిపల్లి, జగ్గయ్యపేట పట్టణం, చిల్లకల్లు, తక్కెళ్లపాడు, మల్కాపురం, గౌరవరం, బండిపాలెం, ధర్మవరప్పాడుతండాలలోని రైతు సేవా కేంద్రాలలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 20 నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూటమి అండతోనే కల్తీ దందా

‘మందు’పాతరేసే వరకూ పోరాడాల్సిందే అంటున్న మహిళలు

కంచికచర్ల: ఎన్నికలకు ముందు కూటమి నాయకులు నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకు అందిస్తామని, ప్రజల ప్రాణాలను కాపాడతామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పలువురు మహిళా నాయకులు విమర్శించారు. వీధికో బెల్టు షాపు, వాటిల్లో ఇష్టారాజ్యంగా నకిలీ మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు గానీ తన కొడుకు లోకేష్ గాని, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాని స్పందించటం లేదని మహిళలు ఆరోపించారు. స్త్రీ శక్తి, మహిళలకే ప్రాధాన్యత అంటూ ఊదరగొట్టే చంద్రబాబు, స్త్రీల మెడలోని తాళిబొట్టు ఉంటాయో లేదో తెలియని పరిస్థితి కల్పిస్తున్నారని విమర్శించారు.



డెప్యూటీ సీఎం ఎక్కడ?



నేను ప్రశ్నించేందుకే రాజకీయాల్లోకి వచ్చానన్న డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎక్కడ ఉన్నారు? రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతుంటే చోద్యం చూస్తున్నారా? చంద్రబాబు ఇచ్చే తాయిలాలకు తలొగ్గిన పవన్ ప్రశ్నించటం మర్చిపోయినట్లున్నారు. ఇదంతా రాష్ట్ర మహిళలు గమనిస్తున్నారు. తగిన సమయంలో బుద్ధిచెబుతారు.

– కోటేరు శ్రీలక్ష్మి, ఎంపీపీ వీరులపాడు


పట్టించుకోని పోలీసులు..



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16నెలలు కావస్తున్నా ఎటువంటి అభివృద్ధి చేయలేదు. టీడీపీ నేతలు కల్తీ మద్యాన్ని బెల్టుషాపులకు సరఫరా చేస్తున్నారు. మద్యం ప్రియులు ఆ మద్యాన్ని తాగి రోగాలబారిన పడుతున్నారు. రానున్న కాలంలో కూటమి నేతలకు తగిన బుద్ధి చెప్పేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు.

– గుడేటి నాగమల్లేశ్వరి, ఎంపీపీ, చందర్లపాడు

ప్రజలకు సమాధానం చెప్పాలి..



కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం ప్రభుత్వానికి తగదు. మహిళలకు తాము అండగా ఉంటామన్న చంద్రబాబు, పవన్ కల్తీ మద్యం విషయంలో ఏం చేయలేకపోతున్నారు. వారంతా ప్రజలకు సమాధానం చెప్పాలి. స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ఇచ్చి, మరో వైపు నకిలీ మద్యాన్ని సరఫరా చేసి పురుషుల జేబులు గుల్లచేయటంతోపాటు వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లే పనులు చేస్తున్నారు.

– పెసరమల్లి రమాదేవి, ఎంపీపీ, నందిగామ

కరాటే మాస్టర్లకు అభినందన



కరాటే మాస్టర్ షరీఫ్, మహ్మద్ అల్లాహ్ షరీఫ్, అబ్దుల్ చంద్‌లను అభినందిస్తున్న ఎమ్మెల్యే



వరుణ్ సాత్విక్, రాజేష్‌లను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం

జగ్గయ్యపేట అర్బన్: కరాటేలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన కరాటే మాస్టర్ల బృందంలో ఉన్న జగ్గయ్యపేటకు చెందిన మాస్టర్లను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అభినందించారు. చెన్నైలోని ఎస్‌ఐవీఈటీ కాలేజీలో ఈనెల 5వ తేదీన జరిగిన వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఈవెంట్‌లో భారత్ కరాటే మాస్టర్లు చరిత్ర సృష్టించారు. ఈ ప్రపంచ రికార్డు ప్రయత్నంలో 1 లక్ష మంది కరాటే మాస్టర్లు, విద్యార్థులు పాలుపంచుకొని నిరంతరంగా 30 నిమిషాలు పంచ్‌లు, బ్లాక్‌లు, కిక్‌లు చేసి గతంలో చైనా దేశం సాధించిన 80వేల మంది, 20 నిమిషాల రికార్డును అధిగమించారు. ఈ చరిత్రాత్మక ఘనతలో జగ్గయ్యపేటకు చెందిన కరాటే గురువు, మాస్టర్ ఫయాజ్ మీరా షరీఫ్, ఆయన కుమారుడు మహ్మద్ అల్లాహ్ షరీఫ్, విద్యార్థి అబ్దుల్ చంద్ భాగస్వాములు అయ్యారు. దీంతో మంగళవారం వారు ఎమ్మెల్యే తాతయ్యను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలవగా, ఆయన వారిని అభినందించారు.

క్రికెటర్లకు అభినందన..

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న అండర్-23 కల్నల్ సీకే నాయుడు మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌కు ఎన్నికైన పట్టణానికి చెందిన టి.వరుణ్ సాత్విక్, అలాగే అండర్-19 విను మన్కడ్ వన్డే టోర్నమెంట్‌కు ఎంపికైన ఎస్.రాజేష్‌ను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అభినందించారు. ఇద్దరూ స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడామైదానంలో ఉన్న ఏసీఏ, కేడీసీఏ, బీవీ సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెక్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు.

ప్రగతి సూచికల లక్ష్య సాధనలో అలసత్వం వద్దు

కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కీలక ప్రగతి సూచికల (కేపీఐ) లక్ష్యాల సాధనకు ప్రతి శాఖ కృషి చేయాలని, ఇందుకు సరైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కీలక ప్రగతి సూచికలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ కేపీఐల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని చెప్పారు. వార్షిక తలసరి ఆదాయ వృద్ధితో పాటు వృద్ధిరేటు 18శాతం ఉండాలన్న లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. వార్షిక రుణ ప్రణాళికలకు అనుగుణంగా రైతులు, కౌలు రైతులకు రుణాలు మంజూరు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జిల్లాలో ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. మత్స్య రంగ విస్తరణపై దృష్టి సారించాలన్నారు. సహకార సంఘాల పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి గోనె సంచులు నేరుగా రైతుకు చేరేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రతి మంగళవారం కీలక ప్రగతి సూచికలపై సమావేశం నిర్వహిస్తామని, జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. సీపీవో వై. శ్రీలత, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కార్మికులకు అండగా సీఐటీయూ పోరాటాలు

ఇబ్రహీంపట్నం: అసంఘటిత రంగ కార్మికులకు అండగా సీఐటీయూ అలుపెరుగని పోరాటాలు చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. ఇబ్రహీంపట్నంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, క్వారీ, క్రషర్‌లు, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, కార్మికుల వలసలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వైద్య సేవలు మెరుగుపర్చాలని సూచించారు. జిల్లా కార్యదర్శి ఎస్‌కే హెచ్ శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎం.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): హెచ్ఐవీ నివారణకు సిబ్బంది సమన్వయంతో పని చేయడంతో పాటు వ్యాధి సోకిన వారికి మెరుగైన సేవలు అందించాలని డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ బి.భానూనాయక్ సూచించారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని డీఎల్‌ఏటీవో కార్యాలయంలో మంగళవారం ఏఆర్టీ, ఐసీటీసీ, బ్లడ్‌బ్యాంక్, డీఎస్ఆర్‌సీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల పనితీరును సమీక్షించారు. నాకో, ఏపీశాక్స్ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. చికిత్స కోసం వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, మెరుగైన సేవలు అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నందిగామ రూరల్: మండలంలోని చెరువు కొమ్ముపాలెం-కొత్తబెల్లంకొండవారిపాలెం గ్రామాల మధ్యన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు మండలంలోని కొత్తబెల్లంకొండవారిపాలెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు తన ద్విచక్ర వాహనంపై నందిగామ వైపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో సుబాబుల్ లోడుతో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తనను 108 వాహనంలో నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



నందిగామ రూరల్: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో ప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని ఐతవరం గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించటంతో పాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించటంతో పాటు అర్హులను గుర్తించి, దరఖాస్తు చేసుకునేలా చూడాలని తెలిపారు. గ్రామంలో జరుగుతున్న రీసర్వే, మినీ గోకులం షెడ్డు నిర్మాణాలు, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని విలేజ్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించి మందులు, రోగులకు అందుతున్న సేవలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు లబ్ధి



నందిగామ టౌన్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని మునిసిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌లో భాగంగా మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని భవన నిర్మాణదారులకు జీఎస్టీ నూతన విధానంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ఇసుక, ఇటుకలు, సున్నం, సిమెంట్, మార్బుల్స్, కిటికీలు, తలుపులపై జీఎస్టీ తగ్గించామన్నారు. దీంతో నిర్మాణ ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. కమిషనర్ లోవరాజు, ఏఈ ఫణి శ్రీనివాస్, మునిసిపల్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు లైసెన్సు తప్పనిసరి

తిరువూరు: దీపావళి పర్వదినం సందర్భంగా మందుగుండు సామగ్రి విక్రయించేందుకు తప్పనిసరిగా తాత్కాలిక లైసెన్సు పొందాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. మాధురి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాణసంచా విక్రయ దుకాణాలు నిర్దిష్ట ప్రదేశంలో రక్షిత ఏర్పాట్లు చేసుకోవాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు, నీటి బకెట్లు, ఇసుక బకెట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. బాణసంచా దుకాణాల వద్ద పొగతాగడం నిషేధించాలని, అగ్నిమాపక వాహనం దుకాణ సముదాయం వద్ద సిద్ధంగా ఉంచాలని చెప్పారు. రెవెన్యూ, మండల పరిషత్, మునిసిపల్, పోలీస్, విద్యుత్, అగ్నిమాపక, వైద్యశాఖలు సమన్వయంతో బాణసంచా విక్రయ అనుమతులకు సిఫారసు చేయాలన్నారు. డివిజన్‌లోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.